# మా ఆవిడ మెచ్చుకుంది!

● తురగా సుందరం ●

అనుకున్నంత పని జరిగింది. పోయిన 'మే' నెల యిట్టే పరుగెట్టుకొచ్చింది. ఏముటో తక్కిన పని తొందరల్లో ఇంత త్వరగా వస్తుందనుకోలేదు. ఇంకేముంది! 'మా ఆవిడ నోటినుంచి ఆమాట ఎప్పుడు ఊడిపడుతుందా' అని బిక్కుబిక్కుమంటూ ఉన్నాను. ఇంకా అదృష్టవంతుణ్ణే, అలాగ అనుకుంటూ ఉండగానే మూడురోజులు గడిచి పోయాయి. నాకు చాలా ఆశ్చర్యంవేసింది. 'ఎప్పుడూ మర్చిపోని మా ఆవిడ ఎలాగ మర్చిపోయింది' అని. ఐతే పెద్దప్రమాదం జరిగి తీరుతుందనే అనుకున్నాను. 'ఇదేముట్రా వీడేదో శత్రువిదిలాగ ఉన్నాడే, తన పెళ్లాం మాటని ఆడేపనిగా పొగడుతున్నాడే' అని మీరనుకో వచ్చు మా ఆవిడయొక్క జ్ఞాపకశక్తి, బుద్ధి విశేషాన్ని గురించి రాయాలంటే ఎన్ని పుస్తకాలైనా చాలవు. ఏ కార్యమైనా సరే మహాపట్టుదలతో చేస్తుంది. తెల్లవారకట్టే లేచి, నిత్యకృత్యాలు తీర్చుకుని, వంటచేయడం మొదలెట్టిందంటే యింట్లో చెంబులు, గిన్నెలు, గరిటెలు అలా సంతోషంతో భరతనాట్యం చేస్తోంటే ఫయిరుయింజను గంట జ్ఞాపకంవస్తుంది. సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంటన్నర అయిందంటే పప్పూ, పులుసు అనే రెండు పదార్థాలతోటి వంటఅయిందన్నమాటే. కాదు, కాదు. వంట ముగిసిందంటే సరిగ్గా ఒంటిగంటన్నర అయిందన్నమాట. ఒకవేళ నిముషాల తేడా వస్తే గడియారం తక్షణం దిద్దించాలి లేక వాచిరిపేరరు దగ్గరికి పంపించాలి. సరిగ్గా రెండుగంటలకి వడ్డించేటప్పుడు తనయొక్క మహత్తర జ్ఞాపకశక్తితో పప్పులో ఉప్పు వెయ్యలేదని, పులుసులో ఉల్లిపాయ లేదని ఆలోచించకుండా చెప్పేస్తుంది. ఒకసారి ఏమయిందంటే......అరే! యీ కథ ఎక్కువై పోతోంది కాబట్టి యింతటితో విరమించి అసలు కథకి వస్తాను.

నాలుగోరోజు మధ్యాహ్నం భోజనానికి కూర్చుని 'కాస్త ఆవకాయ తీసుకు' రమ్మన్నాను. దాంతోటి మా ఆవిడ నోట్లోంచి ఆ కాస్త విషయం ఊడిపడింది. 'ఏమండోయ్! ఈ ఏడాది యింకా ఊరగాయ పెట్టనేలేదు. నా బుద్ధి మండా! యింతవరకు జ్ఞాపకమే రాలేదు. ప్రతీ యేడూ యీపాటికప్పుడే పెట్టేసుకొనే వాళ్ళం. పోనీ యీమాత్రం మీరన్నా జ్ఞాపకం చెయ్యలేకపోయారా? ఏం లాభం? మొగ మహారాజులు. సంసారం గురించి ఏమన్నా ఉంటేగా! ఏదో, ఆడ పీనుగుని కొట్టుకుంటేనే సంసారం నడిచేది...' వగైరా ప్రవాహం దొర్లించింది.

నాయొక్క గుండెలు పదిహేను సెకండుల సేపు ఆగిపోయి మళ్ళీ మామూలుస్థితికి వచ్చేయి. పైకిమట్టుకు విధిలేక గాంభీర్యంవహించి మాట్లాడకుండా భోజనంచేస్తున్నాను. అంతటితో ఊరుకోక 'అదేమిటండీ! బెల్లంకొట్టిన రాయిలాగ ఊరుకుంటే ఎలాగ? ముందర కారాలు తయారుచేసుకోవాలి. దానికి మిరపకాయలు, ఆవాలు, ఉప్పు...కావాలి. ఇంకేమీ ఆలస్యం అవడానికి వీలులేదు. సాయంత్రం అవి తీసుకువస్తే రేపు ఎండబెట్టి, ఎల్లుండి కారాలు కొట్టించుకోవచ్చు. తరువాత మామిడి కాయలు తీసుకువస్తే ఊరగాయలు పెట్టేస్తాను' అని ముందు నాలుగురోజులు ప్రోగ్రాము చెప్పేసింది.

నాకూ కొంత పౌరుషం వచ్చి, 'నాకు వేరే చాల పనుంది' అందామని అనుకున్నాను కాని మాటమీద మాటవస్తే తరువాత యుద్ధంగా పరిణమిస్తే ఏమి లాభం? ఇప్పటికే దేశం అంతా యుద్ధాలతోటి, పోట్లాటలతోటి నిండిపోతే దానికి తోడు యిదికూడా ఏమిటి? తెలివైనవారికి శాంతమే భూషణం అని సమాధానపడి 'సరే' అన్నాను.

ఆవేళ సాయంత్రం దుర్ముహూర్తం లేకుండా చూసుకుని సరుకులు ఎంతెంత తేవాలో పట్టి

తయారుచేసుకుని బజారునుంచి తీసుకువచ్చి యింట్లో పడేశాను. నాయొక్క అదృష్టవశాత్తు నేను తెచ్చిన సరుకులు మెచ్చబడ్డాయి: మర్నాడు ఎండ రాగానే అవన్నీ డాబామీద ఎండబెట్టేసు. మధ్యాహ్నం భోజనంఅయి కాస్త నడుంవాల్చేనో లేదో, మా ఆవిడ పెద్ద పొలికేక పెట్టింది. దాంతో నేను హడిలి ఒక్క గంతు వేసి బయటకెళ్ళి చూసేను. 'వర్షం వచ్చేస్తోంది. డాబామీదకెళ్ళి అవన్నీ తీసెయ్యాలి. అయ్యో! నిక్షేపంలాంటి సరుకులు నాశనం అయిపోతాయి!' అని కంగర్చుకుంటూ చెప్పింది. నేను కాళ్లు కాలుచుకుంటూ డాబామీదికి పరుగెత్తికెళ్ళి చూద్దును కదా వర్షంలేదు, ఏమీలేదు. ఆకాశంమీద ఏమూలో ఒక చిన్న మేఘంముక్కు కనిపించింది. ఆశ్చర్యపోయి కొంతసేపు నిలబడి, మళ్ళీ మా ఆవిడతో మనవిచేసుకున్నాను—దానివల్ల ఏమీ ప్రమాదం రాదని. కాని నామాట వింటేగా! ఇద్దరం సాయంపట్టి అవన్నీ తీసేము. ఈ ప్రకారంగా మూడురోజులు ఎండబెట్టడం కార్యక్రమం జరిగింది.

కారాలు కొట్టడం అవగానే మామిడికాయలు తీసుకురావాలని హృదువుగా ఆజ్ఞ వచ్చింది. మర్నాడు పొద్దున్నే బజారుకి వెళ్లి చూస్తే ఒక్క కొట్టుమీదే ఉన్నాయి మామిడికాయలు. 'ఎప్పుడూ బజారంతానిండిపోయేవి యిప్పుడు ఒక్కచోటే ఉన్నాయేమిటి చెప్మా' అని అనుకుని దుకాణం వాణ్ణి అడిగితే ఈ రోజు మామిడిచెట్లకి సరిగా పూతలేక కాయల సప్లయిలేదనిన్నీ, మామిడిబేరం లేదు వంద పన్నెండురూపాయలకి కావాలంటే తీసుకోవచ్చుననిన్నీ జవాబు వచ్చింది. కాయలు చూస్తే మంచి బాగా పెద్దవిగా ఉన్నాయి. మా ఆవిడ సంతోషిస్తుంది కదా, ఖరీదు ఎంతైతే ఏమిటనుకున్నాను. కాయలు తీసుకుని ధైర్యంగా యింట్లో పడేయించాను.

పీడ వదిలిందికదా అని కాస్త విశ్రాంతి తీసుకుంటూ ఉంటే, మా ఆవిడ కాయలకేసి చూసీ చూడగానే ఒక ముక్క కొరికి నోట్లో వేసుకుని బుగ్గలు నొక్కుకుంటూ 'శ్రీరామరామ! యిలాంటి కాయలు తెచ్చారేమిటి? ఇవి వొట్టి తియ్య పండుకాయలు. ఊరగాయలకి పుల్లటి కాయలు కావాలని ఎన్నిసార్లు మొత్తుకుంటే ఏమి లాభం! బియ్యేలు, ఎమ్మేలు పేసయినా ఒక్కటే

## లేఖలు — వ్రాయండి

ఈ నాడు ప్రజలకు బాధాకరము లయినవీ, అత్యంత ప్రముఖమైనవీ జీవిత సమస్యలు ఎన్నో అనుక్షణమూ ఉత్పత్తిల్లుతున్నవి. వీటన్నిటినీ ప్రభుత్వపు దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిఉన్నది. అతి సంగ్రహంగా మీరు వ్రాసి పంపే సమస్యల్ని సంతోష పూర్వకంగా మేము ప్రకటిస్తాము. ఈ రూపకమైన మా సేవను 'ఆనందవాణి' పాఠకులు, అభిమానులు ఇంతటినుంచి వినియోగించుకోగలరని ఆశిస్తున్నాము

-సంపాదకుడు

మామిడికాయలబేరం తెలియకపోయాక. ఇదే మా మేనత్తకొడుకైతే మంచి రాజాకాయలు యిట్టే తెస్తాడు. నా కర్మవశాత్తు యీ బయట సంబంధం చేసుకుని యిలాంటి కష్టాలు పడవలసివచ్చింది. నిక్షేపంలాంటి మేనరికం చేసుకుంటే ఏ బాధా లేకపోను' అని ఏడుపు మొదలెట్టింది. మా కండి! కట్టుకున్న మొగుణ్ణి కదా అనన్నా గౌరవం లేకుండా మాట్లాడేస్తోందే, అటువంటి క్లిష్టపరిస్థితుల్లో నేను ఏంచెయ్యాలో చెప్పండి. ఇంకోడైతే నోరు వెలితిచేసుకుని వీధుల్లో పడకపోయ్యేడూ! నేను మటుకు మహా వేదాంతి వినా సాక్రటీసు, పెళ్లాం తనమీద పేడ నీళ్ళు చల్లితే చిరునవ్వుతో స్వీకరించేడన్న సంగతి జ్ఞప్తికి తెచ్చుకుని, లేని చిరునవ్వు తెచ్చిపెట్టుకుని 'అయితే యిప్పుడేం చెయ్యమంటావని అడిగేను. దాంతో కొంచెం శాంతించి అవి తీసుకెళ్ళిపోయి దుకాణం వాడి దగ్గర తగలెయ్యమని చెప్పింది

బతుకు జీవుడా అని బయటపడ్డాను చేసుట్టుకారుకుంటూ మళ్ళీ దుకాణంవాడిదగ్గరకి వెళ్లేటప్పటికి వాడు మళ్లీ వాపసు తీసుకోనన్నాడు.

ఒకవేళ మళ్ళీ యింటికి తీసుకువెళ్ళే మాటయితే భార్యారత్నం డొక్క వాలికలు చేస్తుంది. కాబట్టి ఏమీ తోచక కొంతసేపు అటూ, యిటూ పచారు చేయగా ఒక ఆలోచన తట్టి మామిడికాయల బేరానికి వచ్చిన నాబోటి దురదృష్టవంతుల్లో ఒకళ్ళకి రెండురూపాయిలు తక్కువకి ఆ కాయలు సమర్పించుకుని నెత్తిమీద బరువు వదుల్చుకున్నాను.

ఆ రోజల్లా మా గృహలక్ష్మి ధుమధుమలాడుతూనే ఉంది. అక్కడికీ చెప్పేను. బజారులో ఒక్క కొట్లో తప్ప యింకెక్కడా కాయలు లేవని. కాని నమ్మితేగా! ఇరుగునున్న వారు, పొరుగునున్న వీరు రెండు కోసుల దూరంలో ఉన్న వేటపాలెంనుంచి తీసుకువచ్చి ఊరగాయలు పెట్టి అప్పుడే వారంరోజులైందన్న సమాధానం వచ్చింది.

ఈ విధమైన మహాపరాభవం సహించలేని వాడనై మర్నాడు చీకటితో లేచి గొడుగు చేత్తో పట్టుకుని పుల్లమామిడికాయ లేకుండా యింటికి రాకూడదని శపథం చేసుకుని బయలేరాను. తిన్నగా వేటపాలెం వెడితే అక్కడి మామిడికాయ అయిపోయిందని పక్కఊరైన కొమ్మరిపాలెంలో దొరుకుతుందని చెప్తే క్కడకి వెళ్లేను. అదృష్టవశాత్తు కాయ దొరికింది వంద పది రూపాయలకాడికి. మా వూరే పోతోన్న బండి మీద పడేసి వూరు చేరుకున్నాను. ఎందుకన్నా మంచిదని బజారుగుండా యింటికోవని వెడుతూంటే ఎక్కణ్ణుంచి వచ్చిందో కాని బజారంతా మామిడికాయే. దాంతోటి కొంతసేపు నిశ్చేష్టుణ్ణయ్యాను. బజారులో యింత సరుకు పెట్టుకుని ఇన్ని ఊళ్ళు తిరిగివచ్చేనని; మళ్లీ తెలివి తెచ్చుకుని ధర కనుక్కుంటే ఎనిమిదిరూపాయలన్నారు. అది వినేటప్పటికి నా స్థితి మరీ దుర్భరం అయిపోయింది. అక్కడే నిలబడి చేయవలసిన విధానం యేమిటో, మా భార్యామణికి ఏం జవాబు చెప్పాలో దాన్నిగురించి కొంతసేపు ఆలోచించగా చక్కటి ఆలోచన తట్టింది. మళ్లీ ధైర్యం తెచ్చుకుని తిన్నగా యింటికి వెళ్లేను. కాయలు బాగున్నాయని సర్టిఫికేటు పుట్టింది. తరువాత ధర గొడవ వచ్చింది. నిజం చెప్పితే మర్యాద దక్కదని అయిదురూపాయల చొప్పున తీసుకువచ్చేనని బజారులో రేటు ఎనిమిదిరూపాయలని చెప్పేను. అప్పటికి మా ఆవిడ సంతోషభరితురాలై నన్ను ఎంతో పొగిడి ఆ చుట్టుపక్కల వాళ్లందరితోటి గర్వంగా చెప్పింది.





నేతాజీ ఆమ్లా హేరాయిల్

సువాసనతోకూడిన వనమూలికలతో తయారుకాబడినది

★

తలవెండ్రుకలను పెంచును. కుదుళ్ళకు బలమునిచ్చి నల్లగ నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకల నిచ్చుటలో సాటిలేనిది. తలవెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకుట మొదలగువానిని నివారించును.

అన్నివేళలకు ఆనందమునిచ్చి శీతల పరిమళము కలిగియుండును.

వాడిన ఎడల గుణమును గుర్తించగలరు.

సీసా 1 కి రూ. 1-8-0. పోస్టేజి ప్రత్యేకం.

శ్రీ కృష్ణా సోప్ వర్క్సు, శివాలయం వీధి, బెజవాడ.